క్లుప్తంగా

విగ్రహ నిర్మాణానికి రూ.50 వేల అందజేత

ఐ.పోలవరం: ఎదుర్లంక వారధి వద్ద నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి గోగుల్లంక గ్రామం శ్రీవెంకటేశ్వర ఫిషర్‌మెన్ మెరైన్ సొసైటీ అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు రూ.50 వేలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు లంకే హరిబాబు, చింతా ఏడుకొండలు, బొమ్మిడి సత్యనారాయణ, రేకాడి దుర్గారావు, లంకే ప్రసాద్, ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరనాగు దంపతులకు పలువురి పరామర్శ

తాళ్లరేవు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన వైఎస్సార్ సీపీ పి.మల్లవరం గ్రామ కమిటీ కన్వీనర్ పిల్లి వీరనాగు దంపతులను సోమవారం పలువురు పరామర్శించారు. పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు గ్రామంలో వారిద్దరినీ ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సేవలు ప్రశంసనీయం

తాళ్లరేవు: విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు, దళిత నాయకుడు వడ్డి ఏడుకొండలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అభినందించారు. సోమవారం ఇంజరం పంచాయతీ పరిధిలోని అరటికాయలలంక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వడ్డి ఏడుకొండలు రూ.10 వేల ఆర్థిక సాయంతో సమకూర్చిన పుస్తకాలను శివన్నారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, స్కూల్ హెచ్‌ఎం కె.సునాథ్, ఉపాధ్యాయుడు వేణుగోపాల్, నాయకులు దడాల సువర్ణలత, కొప్పుల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

అమలాపురం రూరల్: దేశంలో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని ఏపీ బిషప్ కౌన్సిల్ సభ్యులు బిషప్ జార్జి పాపస్, అడపా ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై, చర్చిలపై జరిగిన దాడులను ఖండిస్తూ ఏపీ బిషప్ కౌన్సిల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ వద్ద కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బిషప్స్ చిరంజీవిరాజు, వి.సురేష్‌కుమార్, పి.ఏసుపాదం, ఎస్.మోజెస్, ఎస్.జీవన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేని విజయవంతం చేయాలి

అల్లవరం: పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై కేంద్ర బృందం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహణలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానం, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ, అమ్మకాలు, ఇంటింటికీ హరిత రాయబారి ద్వారా చెత్త సేకరణ వంటివి కేంద్ర బృందం పరిశీలిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఏఈ స్వామి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

యానాం: ఈ నెల 23న యానాంలో నిర్వహించనున్న అప్పర్ డివిజనల్ క్లర్క్(యూడీసీ)–2023 రాత పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఆదేశించారు. సోమవారం ఆర్‌ఏఓ కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో ఇన్విజిలేటర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభ్యర్థులు బ్లాక్ బాల్ పాయింట్ పెన్, హాల్ టికెట్, ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ తప్ప ఇంకేమీ అనుమతించకూడదన్నారు. సెంటర్ సూపర్‌వైజర్లు పరీక్షకు ఒకరోజు ముందుగానే అన్ని ఏర్పాట్లు సరిచూసుకోవాలని ఆదేశించారు.

పేకాట శిబిరంపై దాడి

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీరంలోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో పేకాట శిబిరంపై సోమవారం సాయంత్రం ఎస్‌ఐ శ్రీను నాయక్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.12 లక్షల నగదు, 7 మోటారు సైకిల్స్, 11 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిధుల మాయంపై ఎస్పీకి ఫిర్యాదు

అమలాపురం టౌన్: పంచాయతీలకు పలు గ్రాంటుల కింద అకౌంట్లలో జమవుతున్న నిధులు మాయమవుతున్నాయని ఆరోపిస్తూ కోనసీమకు చెందిన పలువురు సర్పంచ్‌లు జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తొలుత సర్పంచ్‌లు స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి తమ ఖాతాల నుంచి మాయమవుతున్న నిధుల గురించి దర్యాప్తు చేయాలంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగబత్తుల శాంత కుమారి, రంబాల రమేష్, సంఘం ప్రతినిధులు అడబాల రామ సత్యనారాయణ, పరమట శ్యామ్, వడ్డి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడుగులు

- 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదలైన రూ.1.50 కోట్లు
- గత అయిదేళ్లలో విడుదలైన రూ.12 కోట్లతో అనేక పనులు



అమలాపురం శ్మశానవాటికలో 14వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న గ్యాస్ క్రిమిటోరేషన్ యూనిట్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి ఆర్థిక సంఘం నుంచి విడుదలవుతున్న నిధులతో గత అయిదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గత అయిదేళ్లలో మున్సిపాలిటీకి దఫదఫాలుగా 14వ ఆర్థిక సంఘం ద్వారా రూ.12 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఆ నిధులతో తాగునీటి సౌకర్యం మెరుగుపరచడంతో పాటు పలు రహదారుల అభివృద్ధి తదితర మౌలిక సదుపాయాలను కల్పించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.1.50 కోట్ల నిధులు విడుదల కాగా రెండో విడతగా మరో రూ.1.50 కోట్లు రానున్నాయి. ఈ లెక్కన రానున్న అయిదేళ్లకు మొత్తం రూ.15 కోట్ల నిధులు విడుదల కానున్నాయి.

మౌలిక సదుపాయాలకు పెద్ద పీట

మున్సిపాలిటీకి 14వ ఆర్థిక సంఘం ద్వారా గడిచిన అయిదేళ్లలో విడుదలైన రూ.12 కోట్లతో పట్టణ ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకే పెద్దపీట వేశారు. ముఖ్యంగా తాగునీటి విభాగానికి కొత్త పైపులైన్లు, విస్తరణ, గార్బేజ్ ట్రాన్స్‌మెంట్ ప్లాంట్, పలు రోడ్ల నిర్మాణం, శ్మశానంలో గ్యాస్ ద్వారా శవాలను దహనం చేసే గ్యాస్ క్రిమిటోరేషన్ యూనిట్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన పనులు చేపట్టారు. అందులో కొన్ని పూర్తయితే, మరి కొన్ని ప్రగతిలో ఉన్నాయి. మున్సిపాలిటీ సాధారణ నిధులతో పాటు వివిధ గ్రాంట్‌ల కింద అంటే ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల ద్వారా మున్సిపాలిటీలో ప్రస్తుత కౌన్సిల్ ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోంది. రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఈ నిధుల వ్యయం, పనుల ఎంపికపై కౌన్సిల్‌తో చర్చించి సముచితమైన, అనువైన నిర్ణయాలు తీసుకున్నారు.

ముందస్తు ప్రణాళికలు

రానున్న అయిదేళ్లలో మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.15 కోట్లు దశల వారీగా విడుదల కానున్న నేపథ్యంలో అభివృద్ధి పనులకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తాజాగా ఈ ఏడాదికి తొలి విడతగా విడుదలైన రూ.1.50 కోట్లతో వేస్ట్ మేనేజ్‌మెంట్, తాగునీటి విభాగంలో మరింత మెరుగైన సరఫరా కోసం పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ఏడాది చివరిలో వచ్చే మరో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సన్నాహాలు చేస్తున్నారు. మంత్రి విశ్వరూప్‌తో పాటు తాజాగా కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుల సమాలోచనలు సాగించి కౌన్సిల్‌లో చర్చించి సభ్యుల ఆమోదంతో పనులు చేపట్టనున్నారు.

మరింత అభివృద్ధికి ప్రణాళిక

15వ ఆర్థిక సంఘం నిధులతో మున్సిపాలిటీలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రచిస్తున్నాం. కౌన్సిల్ సూచనలు, ఆమోదాలు, తీర్మానాలతో ప్రతి పనిని పారదర్శకంగా చేపడతాం. ఆర్థిక సంఘాల నిధులు మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించేందుకు ఎంతో దోహదపడుతున్నాయి.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

వాలంటీర్లకు వందనం

మనవడిలా సాయపడ్డాడు



వైద్యం కోసం వృద్ధురాలిని తీసుకెళుతున్న వలంటీరు మణికంఠ

ఐ.పోలవరం: గతేడాది గోదావరి వరదల సమయంలో జి.మూలపొలం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ అంగాడి ధనమ్మ ఇంటి చుట్టూ వరద నీరు చుట్టుముట్టింది. పైగా అదే సమయంలో ఆమె అనారోగ్యంగా ఎటూ కదల్లేని పరిస్థితిలో ఉండిపోయింది. స్థానిక వలంటీర్ సంగాని మణికంఠ వరద నీటిలోనే ఆమె ఇంటికి వెళ్లి పరిస్థితి తెలుసుకుని ధనమ్మను అక్కడి నుంచి జి.మూలపొలంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. అంతేకాదు వరద ఉన్నన్ని రోజులు మణికంఠ నిత్యం ఆమెకు కావాల్సిన భోజన సదుపాయాన్ని కల్పించాడు. ఆమెకు ఎప్పుడు ఆరోగ్యం బాగోక పోయినా మణికంఠ సాయం అందిస్తున్నాడు. అందుకే వలంటీర్ మణికంఠ పేరెత్తితే చాలు నా సొంత మనవడిలాగే సాయం చేస్తాడంటూ ధనమ్మ ఆనందం వ్యక్తం చేస్తుంది.

సాయాన్ని మరిచిపోలేను

వలంటీరు మణికంఠ చేస్తున్న సాయాన్ని మరిచిపోలేను. ప్రత్యేకించి వరదల సమయంలో మా ఇంటి చుట్టూ నీరు చుట్టిముట్టినా ప్రాణాలు లెక్కచేయకుండా వచ్చి నన్ను వైద్యం కోసం ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. అంతేకాదు ప్రతి రోజు ఆహారపొట్లాలు తెచ్చి ఇచ్చాడు. వలంటీరు సేవలను తప్పు పడితే పాపం ఊరికే పోదు.

– అంగాడి ధనమ్మ, జి.మూలపొలం

ఆప్యాయంగా పలకరిస్తూ..



లక్ష్మీనరసమ్మకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ బాబి

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి గెల్లా బాబా సాహెబ్(బాబి). అమలాపురం పట్టణంలోని 13వ వార్డులో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఆ వార్డులో తనకు కేటాయించిన 50 కుటుంబాల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు, సేవల గురించి ఓపిగ్గా వివరిస్తాడు. వాళ్ల చేత దరఖాస్తు చేయించి ఆ లబ్ధి వారికి చేరేలా కృషి చేస్తాడు. ముఖ్యంగా కరోనా సమయంలో అతడు అందించిన సేవలకు ఆ వార్డులోని ప్రజలంతా వలంటీర్‌ను ఇప్పటికీ కొనియాడుతూనే ఉంటారు.

ఇంట్లో మనిషిలా చూసుకుంటాడు



ప్రతి నెలా వచ్చే పింఛనే నాకు జీవనాధారం. మా వలంటీర్ బాబి నా ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తూనే ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లారగానే నా ఇంటి తలుపు తట్టి పింఛన్ డబ్బులు ఇస్తాడు. నా సొంత మనవడిలానే సేవలు అందిస్తున్నాడు. నాకు పింఛన్ ఇవ్వడమే కాదు నా కూతుళ్లకు వైఎస్సార్ చేయూత లబ్ధి కూడా వలంటీర్ బాబి వల్లే వచ్చాయి.

– కుడుపూడి లక్ష్మీనరసమ్మ, పింఛన్ లబ్ధిదారు, శ్రీరామపురం, అమలాపురం

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- రాయమెరకలో గడప గడపకూ మన ప్రభుత్వం



రాయమెరకలో జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం జి.వేమవరం పంచాయతీ పరిధిలోని రాయమెరక గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు గత నాలుగేళ్లలో పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే పొన్నాడకు గ్రామస్తులు పూలు జల్లుతూ, కోలాట నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నట్లు ఎమ్మెల్యే పొన్నాడ తెలిపారు. జి.వేమవరం పంచాయతీ పరిధిలోని గుమ్మళ్లపేటలో రూ.31 లక్షల ఓఎన్జీసీ, సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, సర్పంచ్ పి.సూరిబాబు, ఉప సర్పంచ్ మట్టా లింగమూర్తి, గండి రామాంజనేయులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సమర్పించిన వివిధ రకాల పిండి వంటలు

యానాం: యానాం గోపాల్‌నగర్ రామరాజు గార్డెన్స్‌లో కొలువై ఉన్న ధనలక్ష్మీకల్యాణలక్ష్మి అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సోమవారం భారీ సారె సమర్పించారు. ఈ సందర్భంగా మేళతాళాల మధ్య భారీ ఊరేగింపుగా సారెను ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో లలిత సహస్ర నామపారాయణం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో గోపాల్‌నగర్, గాంధీనగర్, యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వజ్ర వారాహి హోమం



అమలాపురంలో జరిగిన వజ్ర వారాహి అఖండ హోమంలో పాల్గొన్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో ఆషాఢ మాసం ఆదివారం పుణ్య తిథిని పురస్కరించుకుని జరుగుతున్న వజ్ర వారాహి అహోరాత్రి అఖండ హోమం సోమవారం అర్ధరాత్రి వరకూ వైభవంగా సాగింది. రెండో రోజు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాగిన హోమ పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొని నారికేళ(కొబ్బరి), కూష్మాండ(గుమ్మడి) బలి సమర్పించారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అక్షయ పాత్ర వ్యవస్థాపకులు పోతురాజు రామకృష్ణారావు, నాగ కనకదుర్గ, అక్షయ పాత్ర సేవకులు లింగోలు విస్సు, అరిగెల బుజ్జి, తూము దొరబాబు, గొవ్వాల అచ్యుతరామయ్య, కేవీ మావుళ్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య సేవలు చిరస్మరణీయం



బీవీ రమణయ్య జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం మాజీ శాసన సభ్యులు బీవీ రమణయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురం గడియారం స్తంభం సెంటరులో దళిత ఐక్య వేదిక, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బీవీ రమణయ్య 89వ జయంతి వేడుకల సభకు కలెక్టర్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత బీవీ రమణయ్య చిత్రపటానికి కలెక్టర్ శుక్లా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జయంతి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, ఆర్డీవో వసంతరాయుడు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, రఘుబాబు, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రమణయ్యకు ఘన నివాళి

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శరత్ అధ్యక్షతన మాజీ శాసనసభ్యుడు బీవీ రమణయ్య జయంతి వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పెనుమాల సుధీర్ అంబేడ్కర్ తొలుత రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య జయంతి సందర్భంగా భీమనపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి ఆధ్వర్యంలో రమణయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయ్యిల కొండబాబు, రాజేష్ పాల్గొన్నారు.

సీఎం జగన్ దృష్టికి కొబ్బరి కార్మికుల సమస్యలు

అమలాపురం టౌన్: కొబ్బరి కార్మికుల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళతానని ముమ్మిడివరం ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ రాష్ట్ర కొబ్బరి కొబ్బరి ఒలుపు, దింపు కార్మికుల సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందానికి వివరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యాన సంఘ ప్రతినిధుల బృందం అమలాపురంలోని ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహంలో ఆయనను సోమవారం ఉదయం కలిసి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే పొన్నాడ తమ సంఘానికి రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా ఉన్నారని, తమ సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం కోనసీమ జిల్లా అధ్యక్షుడు జోగి ఏడుకొండలు, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బోయిన విష్ణు పాండురంగ తదితరులున్నారు.

ఇందిరకు నియామక పత్రం అందజేత



సీఎం రంగసామి నుంచి ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంటున్న ఇందిర

యానాం: నియోజకవర్గం నుంచి స్టెనోగ్రాఫర్‌గా ఎంపికైన ఒకే ఒక్క యువతి చేటకాల ఇందిరకు ఉద్యోగ నియామక పత్రాన్ని సీఎం రంగసామి సోమవారం అందజేశారు. స్టెనోగ్రాఫర్ పోస్టులకు ఏప్రిల్ 30న పరీక్ష నిర్వహించగా జనరల్ కేటగిరీలో యానాంలోని పరంపేటకు చెందిన ఇందిర ఎంపికయ్యారు. 11 ఏళ్ల తర్వాత యానాం నుంచి స్టెనోగ్రాఫర్ ఉద్యోగానికి ఎంపికైన ఏకైక మహిళ ఇందిర కావడం విశేషం. 2012లో యానాం నుంచి కొల్లు లక్ష్మీవరప్రసాద్ మాత్రమే ఎంపికయ్యారు.

అంబులెన్స్ డ్రైవర్ల నిర్లక్ష్యంపై ఫిర్యాదు

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్ల నిర్లక్ష్యంపై డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌కు హేమ అనే బాలింత బంధువులు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక కురసాంపేటకు చెందిన హేమ అనే మహిళ డెలివరీ నిమిత్తం గత శనివారం జీజీహెచ్‌లో జాయిన్ అయ్యింది. ఆమెకు అదే రోజు డెలివరీ సైతం జరిగింది. అయితే పుట్టిన శిశువుకు పచ్చకామెర్లు సోకాయని అత్యవసరంగా కాకినాడ తరలించాలని వైద్యులు సోమవారం సూచించారు. దీంతో బాలింత బంధువులు ఆసుపత్రి అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే దీర్ఘకాలిక వ్యాధి ఉన్న ఒక రోగిని ఎక్కించుకున్న అంబులెన్సులోనే శిశువును సైతం తీసుకెళతామని సిబ్బంది చెప్పారు. రెండు రోజుల శిశువుకు ఏదైనా ఇన్‌ఫెక్షన్ సోకితే ఎవరు బాధ్యత వహిస్తారని బాలింత బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నేరుగా డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌కు ఫిర్యాదుచేశారు. జీజీహెచ్‌లో ఉండే పర్మినెంట్ డ్రైవర్లు ఎవరి మాట వినడం లేదని, కాంట్రాక్టు డ్రైవర్లు చెప్పినట్లే చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

లభించని కాంచన ఆచూకీ

యానాం: ఎదుర్లంక బాలయోగి వారధి నుంచి ఆదివారం రాత్రి గోదావరిలో దూకి గల్లంతైన యానాంకు చెందిన మందింగి కాంచన(22) ఆచూకీ ఇప్పటివరకూ లభించలేదు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ పడవల సాయంతో గౌతమీ గోదావరి, లంకల పాయల్లో సైతం స్థానిక మత్స్యకారులు విస్తృతంగా గాలించినా ఫలితం లేకపోయింది.

‘సురక్ష’తో నూరు శాతం ప్రభుత్వ సేవలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



గాడిమొగలో మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు నూరు శాతం ప్రభుత్వ సేవలు అందినట్లయిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అమలాపురం 15వ వార్డు సచివాలయంలో వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి అధ్యక్షతన సోమవారం జరిగిన జగనన్న సురక్ష సభకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాల్లో అర్హులెవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా అవసరమైన అన్ని ధ్రువపత్రాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, బంగారు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లరేవు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సోమవారం గాడిమొగలోని రిలయన్స్ కమ్యూనిటీ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు 839 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, ప్రత్యేకాధికారి లక్ష్మీనరసయ్య, తహసీల్దార్ ఎస్.పోతురాజు, నాయకులు వనమాడి నూకరాజు, చెక్కా కామేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

కాట్రేనికోన: ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను చేరువ చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ అన్నారు. మండలంలోని పల్లం, కందికుప్ప గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పల్లంలో 1,303 మంది లబ్ధిదారులకు, కందికుప్పలో 744 మంది లబ్ధిదారులకు ఆయన ధ్రువపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ఏడిది అరుణ, సర్పంచులు మల్లాడి వీరబాబ్జి, చల్లగల వెంకటలక్ష్మి, తహసీల్దార్ వి.సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటచలం, ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు పాల్గొన్నారు.

మోసగించాడంటూ యువతి ఫిర్యాదు

ఉప్పలగుప్తం: సమీప బంధువు ప్రేమ పేరుతో నమ్మించి వాడుకుని పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం వైరుపేటకు చెందిన ఓ యువతి తన మేనమామ కుమారుడైన కుంచే శివకుమార్‌తో రెండేళ్లుగా ప్రేమలో ఉంది. అప్పటి నుంచి శివకుమార్ తనను శారీరకంగా ఉపయోగించుకుని పెళ్లి విషయం మాట్లాడేసరికి నిరాకరిస్తున్నాడని తనకు న్యాయం చేయాలంటూ యువతి ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏపీ పీజీ సెట్ విజేతలకు ఎస్పీ అభినందన

అమలాపురం టౌన్: ఏపీ పీజీ సెట్‌లో స్టేట్ ర్యాంకర్స్‌గా నిలిచిన స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులను జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ సోమవారం అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు చిక్కాల కీర్తి(9వ ర్యాంక్), సత్తి భవ్య(13వ ర్యాంక్), అల్లు వెంకటలక్ష్మి(15వ ర్యాంక్), ఉప్పుగంటి పావని(19వ ర్యాంక్), చీకట్ల మౌనిక(29వ ర్యాంక్), సీహెచ్ రూప(78వ ర్యాంక్)లను ఎస్పీ అభినందించి సివిల్స్‌లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్, అధ్యాపకులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అల్లవరం: బోడసకుర్రు బ్రిడ్జి దిగువన 6వ పిల్లర్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని సోమవారం మధ్యాహ్నం స్థానికులు గుర్తించారు. మృతదేహం సుమారు 50 ఏళ్ల వయసున్న పురుషుడిదని ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. నలుపు రంగు ప్యాంట్, నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఆదివారం రాత్రి సైకిలు, చెప్పులు బ్రిడ్జి మీద వదిలేసి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచామని చెప్పారు. మృతదేహం ఆచూకీ కోసం 08856 2359433, 94907 60764 నెంబర్లకు సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

తాళ్లరేవు: ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకముందే వివాహాలు చేస్తే బాల్య వివాహ నిషేధ చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి వంజరాన మాధవి హెచ్చరించారు. సోమవారం జి.వేమవరం హైస్కూల్‌లో బాల్య వివాహాల నిషేధంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.

విద్యుత్ సర్వీసుల తొలగింపు

అల్లవరం: మండలంలో విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉన్న 181 సర్వీసులను తొలగించామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ సోమవారం తెలిపారు. బకాయిల వసూలుకు మండలవ్యాప్తంగా ఏక కాలంలో 35 బృందాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. మొత్తంగా 390 విద్యుత్ సర్వీసులకు గాను రూ.1.26 కోట్ల బకాయి ఉండగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో రూ.71.50 లక్షలు వసూలైందన్నారు. బకాయిలు వసూలు కాని 181 సర్వీసులను తొలగించామని చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కొరిపి రాజేష్(21) సోమవారం మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం రాజేష్ బైక్‌పై ప్రయాణిస్తూ యానాం బైపాస్‌లోని గణపతినగర్ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.